పనులను ప్రారంభించరా..

- అధికారులు నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం
- చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయండి
- స్పందించకుంటే ప్రజలతో కలిసి ఆందోళన
- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం


కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 19: సమస్యల పరిష్కారం దిశగా రూ.65 కోట్ల నిధులతో శంకుస్థాపన చేసి తొమ్మిది నెలలైనా అధికారులు పనులను ప్రారంభించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు, కార్పొరేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. రాష్ట్రంలో కేవలం ప్రభుత్వం మాత్రమే మారిందని, ఇక్కడ పనిచేస్తున్న అధికారులేవ్వరూ మారలేదు కానీ ఉదాసీనంగా ఎందుకు వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. సమస్యలతో ప్రజలు బాధపడుతుంటే అధికారులు కారణాలు చెబుతూ.. కాలయాపన చేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కేపీహెచ్‌బీకాలనీలో 5.08 కోట్లు, బాలాజీనగర్‌లో 2.45 కోట్లు, అల్లాపూర్‌లో 0.70 కోట్లు, మూసాపేటలో 1.06 కోట్లు, ఫతేనగర్‌లో 0.50 కోట్లు, బోయిన్‌పల్లిలో 1.97 కోట్లు, బాలానగర్‌లో 0.17 కోట్లు, కూకట్‌పల్లిలో 0.40 కోట్లు కలిపి మొత్తం 12.33 కోట్లు కేటాయించి శంకుస్థాప చేశామని, కానీ నేటికీ పనులు ముందుకు సాగడం లేదన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారం, ఫైప్‌లైన్ పునరుద్ధరణ కోసం రూ.8 కోట్లకు పైగా నిధులు కేటాయించామని, పలు అభివృద్ధి పనుల కోసం నిధులు తీసుకొచ్చానన్నారు. కేపీహెచ్‌బీకాలనీ 3,9 ఫేజ్‌లలో పార్కుల గోడ, కల్వరీ టెంపుల్ నుంచి ముళ్లకత్వ చెరువు వరకు చేపటిన కాల్వ మరమ్మతు పనులు, రంగదాముని చెరువు(ఐడీఎల్) సుందరీకరణ పనులను పూర్తి చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించడంలో ఆఫీసర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. ప్రజలతో కలిసి ఆఫీస్‌ల ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రజా సమస్యలపై ఏకరువు..

కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కుక్కల బెడద, పారిశుధ్య నిర్వహణ లోపం, వీధీ దీపాల సమస్య, చెట్ల కొమ్మల తొలగింపు, డ్రైనేజీ, నాళా సమస్యలతో కూడిన అనేక సమస్యలను ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఈ చిన్నారెడ్డి, జలమండలి జీఎం ప్రభాకర్‌రావు, డీసీ రమేశ్, కార్పొరేటర్లు మందడి శ్రీనివాస్‌రావు, జూపల్లి సత్యనారాయణ, పగుడాల శిరీష, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీశ్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు శ్రావణ్‌కుమార్, బాబురావు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్

ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జడ్సీ స్నేహ శబరీష్

మియాపూర్, జూన్ 19: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా విధులను నిర్వర్తించాలని శేరిలింగంపల్లి జడ్సీ స్నేహ శబరీష్ ఆదేశించారు. అనునిత్యం అప్రమత్తంగా ఉండి అవసరమైన ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మాన్‌సూ న్ బృందాలతో జడ్సీ బుధవారం తన చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను ఇప్పటికే గుర్తించినందున నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రధానంగా నాలాల ఆక్రమణలను తొలగించాలని, వర్షపు నీరు ఆటంకం లేకుండా ముందుకు సాగేలా చూడాలన్నారు. నాలాల్లో వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని జడ్సీ ఆదేశించారు. నీటి నిల్వ ప్రాంతాల్లో చర్యలను ఎప్పటికప్పుడు నివేదించాలని జడ్సీ స్నేహ శబరీష్ స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పలు విభాగాలతో సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

21న సుచిత్రలో యోగా శిబిరం

కుత్బుల్లాపూర్, జూన్ 19: ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సుచిత్ర చౌరస్తాలో ఉచిత యోగా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు శివహోం యోగా పరిశోధన కేంద్రం నిర్వాహకుడు కె.రవీందర్‌రాజు తెలిపారు. ఉదయం 5.45 నుంచి సాయంత్ర 7.25 గంటల వరకు జరిగే యోగా శిక్షణలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని, వివరాలకు 93963 78418 నంబర్‌ను సంప్రదించాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

వివాహిత అదృశ్యం

శ్రీదేవి

జగద్గిరిగుట్ట, జూన్ 19: ఇంటి నుంచి వెళ్లిన మహిళ కనిపించకుండా పోయిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శంకర్ వివరాల మేరకు.. పాపిరెడ్డినగర్ బీబ్లాకులో సుబ్బారావు, శ్రీదేవి(50) దంపతులుంటారు. ఎలాంటి సమాచారం లేకుండా శ్రీదేవి బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె భర్త సుబ్బారావు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

గృహకల్పలో డిగ్రీ విద్యార్థిని

సంధ్య

దుండిగల్, జూన్ 19: డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాజీవ్‌గృహకల్ప 57వ బ్లాక్ 17వఫ్లాట్‌లో నేనావత్ నారియా కుటుంబంతో ఉంటున్నాడు. తన కూతురు సంధ్య (20) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. మంగళవారం కుటుంబీకులు బయటికెవెళ్లి, పనులు ముగించుకొని ఇంటికొచ్చారు. ఇంటివద్ద సంధ్య కనిపించలేదు. సోదరుడు సురేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పర్యటిస్తా.. సమస్యలు పరిష్కరిస్తా


ఎమ్మెల్యే గాంధీతో మొగులమ్మ బస్తీ వాసులు


ఎమ్మెల్యే గాంధీతో ప్రేమ్‌నగర్ కాలనీ వాసులు

మియాపూర్ , జూన్ 19: కాలనీలలో నెలకొన్న సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కాలనీల సమగ్రాభివృద్ధికి సంపూర్ణ తోడ్పాటును అందిస్తానని అన్నారు. కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ బీ బ్లాక్‌లో పోచమ్మ గుడి సమీపంలోని 40 మీటర్ల సీసీ రోడ్డు, శ్రీకృష్ణుడి ఆలయం వద్ద 80 మీటర్ల సీసీరోడ్డు, పార్టు స్ట్రీట్, గణేశ్ దేవాలయం, చర్చి ఎదుట సీసీరోడ్డు నిర్మాణం, ఈద్గా నుంచి పోచమ్మ దేవాలయం వరకు మంజీరా వాటర్ లైన్, విద్యుత్ పోల్స్ సమస్యలపై కాలనీవాసులు ఎమ్మెల్యే గాంధీని బుధవారం ఆయన నివాసంలో కలుసుకుని విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత విభాగాల అధికారులకు సమస్యలను తెలిపారు. కాలనీలో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించి మౌలిక వసతుల కల్పనను చేపడతానన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తగినన్ని నిధుల మంజూరుతో విస్తృతమైన అభివృద్ధి పనులను చేపట్టగలిగినట్లు ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ప్రజా అవసరాలపై ఎప్పటికపుడు ప్రభుత్వంతో పోరాడి నిధులు సాధించి కాలనీలను పురోగతి వైపు నడిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యం గౌడ్, మంగలి కృష్ణ, ప్రభాకర్, చారి, మల్లేశ్, శివ, నాయుడు పాల్గొన్నారు.

* ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని మొగులమ్మ బస్తీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు ఎమ్మెల్యే గాంధీని ఆయన నివాసంలో కలుసుకొని విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమస్య పునరావృతం కాకుండా చూడాలన్నారు. తమ ప్రభుత్వ హయాంలో తగినన్ని రిజర్వాయర్లు, లైన్ల విస్తరణను విస్తృతంగా చేపట్టినట్లు, ప్రజలకు ఎటువంటి తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధికి అండగా నిలుస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు


కలశ పూజలో పాల్గొన్న భక్తులు

అల్లాపూర్, జూన్ 19: ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పూజలు నిర్వహించారు. మొదటి రోజు మహిళలు పెద్దఎత్తున పాల్గొని కలశ పూజల్లో పాల్గొన్నారు. కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామిని నియమ నిష్ఠలతో పూజిస్తే కోరినకోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసమని ఆలయ చైర్మెన్ వీఎస్వీ సత్యనారాయణ అన్నారు. ఈ పూజల్లో కార్యనిర్వహణ అధికారి జీఏకే కృష్ణ, కమిటీ సభ్యులు, డి.రేవతి, సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణస్వామి, సుశీల్‌యాదవ్, డి.రామ, అనిల్‌కుమార్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం

పీజేఆర్‌కాలనీలో డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్

మియాపూర్, జూన్ 19: మురుగు నీరు లీకై రోడ్లపైకి చేరి తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని, తాగునీరు సరిగా సరఫరా కాకపోవటంతో ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్ విన్నవించారు. కాగా స్థానికులతో కలిసి బుధవారం సమస్యాత్మక ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు. లైన్ల విస్తరణకు అదనపు నిధులు మంజూరు చేయించి పనులను చేపడతామని పేర్కొన్నారు. తాగునీటి సరఫరాను మరింతగా పెంచాలని అధికారులకు సూచించారు. పారిశుధ్య పరిస్థితులను మరింత మెరుగు పరచాలని సిబ్బందిని కార్పొరేటర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఝాన్సి, రవికుమార్, రవీందర్‌రెడ్డి, నాగరాణి, నర్సింహులు, శివ, మల్లేశ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

కాఫీ ప్రియులు, సాగుదారులు, కేఫ్ యాజమానులు, స్పెషాలిటీ కాఫీ కమ్యూనిటీలకు చెందిన వారందరిని ఒకే చోటుకు చేర్చి రత్నగిరి కాఫీ ఎస్టేట్ ఆధ్వర్యంలో బుధవారం నాలెడ్జ్ సిటీలో 'క్రాఫ్టింగ్ కాఫీ కల్చర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రత్నగిరి ఎస్టేట్ నుంచి తీసుకువచ్చిన అత్యుత్తమ కాఫీలను ప్రదర్శనలో ఉంచారు. కాఫీ సాగు, కేఫ్ నిర్వహణ అంశాలపై రత్నగిరి ఇంటర్నేషనల్ మేనేజింగ్ పార్టనర్ అశోక్ పాత్రేతో ప్రత్యేక చర్చను నిర్వహించారు.

- కొండాపూర్

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ పుట్టిన రోజును పురస్కరించుకుని పార్టీ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ కార్యాలయంలో బుధవారం కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

- మియాపూర్

రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 19: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్, బీపీఈడీ, డీపీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ. 700 చొప్పున చెల్లించి, వచ్చే నెల 1లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చేనెల 3లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

ఎంఈడీ పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 19: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24, 26 తేదీల్లో జరుగనున్న ఎంఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు చెప్పారు. పరీక్షలను వచ్చే నెల 1, 3 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇతర వివరాలకు www. osmania. ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మియాపూర్ , జూన్ 19: మియాపూర్ ఠాణా పరిధిలో గుర్తుతెలియని మృత దేహాన్ని (60) మియాపూర్ పోలీసులు గుర్తించారు. మంగళవారం సుమారు ఉదయం 10 గంటల ప్రాంతంలో మియాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో అపస్మారకస్థితిలో ఉన్న వ్యక్తిని స్థానికులు గుర్తించారు. వైద్యం నిమిత్తం గాంధీ దవాఖానకు పోలీసులు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు.

సుచిత్ర శ్రీచైతన్య స్కూల్ ఎదుట ధర్నా

నిబంధనలు పాటించని స్కూల్ అనుమతులు రద్దు చేయాలి

తెలంగాణ ప్రైవేట్ బడ్జెట్ పాఠశాలల యాజమాన్యం డిమాండ్

చిత్రలో శ్రీచైతన్య టెక్నో స్కూల్ ముందు ధర్నా చేస్తున్న ప్రైవేట్ బడ్జెట్ పాఠశాలల యాజమాన్యం

కుత్బుల్లాపూర్, జూన్ 19: విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా నూతనంగా సుచిత్రలో ఏర్పాటు చేస్తున్న శ్రీచైతన్య టెక్నో స్కూల్ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల అసోషియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, కార్యదర్శి ఎస్ఎన్ రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. స్కూల్‌కు మరో స్కూల్ వ్యత్యాస దూరం లేకుండా నడపడం బడ్జెట్ పాఠశాలల ఉనికిని దెబ్బతీయడమే అని అన్నారు. సుచిత్ర శ్రీచైతన్య టెక్నో స్కూల్ పూర్తిగా విద్యాశాఖా నిబంధనలకు వ్యతిరేఖంగా ఏర్పాటు చేశారని, దానికి ఎలాంటి అనుమతులు రాకముందే 300 మంది విద్యార్థులను చేర్చుకొని వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. కార్పొరేటర్ విద్యాసంస్థలు ఇలాంటి చర్యలకు పాల్పడడం సరైంది కాదని, వెంటనే ఇక్కడ ఏర్పాటు చేసిన శ్రీచైతన్య టెక్నో స్కూల్‌ను మరోచోటుకు మార్చుకోవాలని అన్నారు. అందుకు విద్యాశాఖ అధికారులకు ఎలాంటి అనుమతులు జారీ చేయకుండా ఫిర్యాదులు చేశామని, దీనిని తల్లిదండ్రులు గమనించాలని కోరారు. అనంతరం సెయింట్ ఆంథోనీ స్కూల్ కరస్పాండెంట్ సుందర్‌రాజ్ మాట్లాడుతూ తాము 25 ఏండ్లుగా ఇక్కడ పాఠశాలను నడుపుతున్నామని, అనేకమంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్యను అందిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. కానీ శ్రీచైతన్య స్కూల్ బడ్జెట్ స్కూళ్లను టార్గెట్‌గా చేసుకొని మరో 40 బడులు మూత పడేవిధంగా కవ్వింపు చర్యలకు పాల్పడుతుందని, దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో అసోషియేషన్ ప్రతినిధులు మహేశ్, శ్రీనివాస్‌గౌడ్, చింతల మల్లేశ్, గోవర్ధన్‌తో పాటు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలానగర్ డీసీపీగా సురేశ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

సురేశ్‌కుమార్
బాలానగర్ డీసీపీ

జీడిమెట్ల, జూన్ 19: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ బాలానగర్ జోన్ డీసీపీగా సురేశ్‌కుమార్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శాంతిభద్రతల పర్యవేక్షణపై కిందిస్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 19: కూకట్‌పల్లి రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 55, వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 85, బజ్జిమిర్చి 70, కాకరకాయ 65, బీరకాయ 72, క్యాబేజీ 23, ఫ్రెంచ్ బీన్స్ 155, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 28, దొండ 45, చిక్కుడు 70, గోరుచిక్కుడు 55, బీట్‌రూట్ 23, క్యాప్సికం 75, ఆలుగడ్డ 35, కీరా 33, దోసకాయ 23, సొరకాయ 17, పొట్లకాయ (1) 23, కందగడ్డ 50, ఉల్లిపొరక –, ఉల్లిగడ్డ 39, చింతకాయ–, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 9 నుంచి 11, చామగడ్డ 37, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 40, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చిబఠాని –, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 180, వెల్లుల్లి 240, చింతపండు 120గా ఉన్నా యి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు అమలులో ఉంటాయి.

నిత్య పరిశోధనతో కొత్త ఆవిష్కరణలు

వర్సిటీ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి


జాతీయ సదస్సులో రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ వెంకటనర్సింహారెడ్డి, మాధవిలత, రజనీ తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 19: సమాజంలో వస్తున్న మార్పులను గమనించాలని, నిత్య పరిశోధనతో కొత్త ఆవిష్కరణలు చేపట్టాలని వర్సిటీ రెక్టార్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం జేఎన్‌టీయూహెచ్ ఎలక్ట్రానిక్స్ విభాగం, మ్యాథ్‌వర్క్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 'లీడింగ్ ది వే.. నావిగేట్ ది ఎమర్జింగ్ ట్రెండ్స్ ఆఫ్ ఏఐ, ఎలక్ట్రాఫికేషన్ అండ్ ఐవోటీ ఇన్ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్' అంశంపై ఒక రోజు జాతీయ సదస్సును నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా విజయ్‌కుమార్ రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ వెంకటనర్సింహారెడ్డి, ఏఐ నిపుణులు రమణ అంచూరి, జాహిదావసీమ్, లక్ష్మీనారాయణ్, విజు రవిచంద్రన్, కోఆర్డినేటర్ ఎం.మాధవిలత హాజరైయ్యారు. పరిశ్రమ, విద్యాపరిశోధన, పర్యావరణ వ్యవస్థలో అర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, ఎలక్ట్రిఫికేషన్ అండ్ ఐవోటీ అభివృద్ధి, మెట్ల్యాబ్ అండ్ సిమ్‌లింక్ సాధనాలు ఏఐ, విద్యుదీకరణ అండ్ ఐవోటీలో పాఠ్యాంశాలు పరిశోధనలో ఆవిష్కరణలు, సాంకేతిన పురోగతులపై చర్చించారు. వర్తమానంలో ప్రతి విషయంలో పరిశోధనలు చేయాలన్నారు. ఏఐ లాంటి కొత్త టెక్నాలజీతో భవిష్యత్‌లో కొత్తతరం ఆవిష్కరణలు వస్తాయని, కొత్త అంశాలపై చర్యలతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఎ.రజని, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కేపీహెచ్‌బీకాలనీ 2వ రోడ్డులోని ప్రభుత్వ బడిలో ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. కాలనీ 3వ ఫేజ్‌లోని రమ్యాగ్రౌండ్‌లో నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేశారు. పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్, మాజీ అధ్యక్షుడు శేరి సతీశ్‌రెడ్డి, బచ్చురాజు, ప్రవీణ్ కుమార్, అరవింద్‌రెడ్డి, మేకల మైకల్, ఫణికుమార్ ఉన్నారు. మూసాపేటలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ మోయిజ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్‌కట్‌చేసి, అనాథ వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుస్రు, నర్సింగ్, చక్రవర్తి, సలీం, అక్తర్, రవి, ఖదీర్, ఆరీఫ్, సుల్తాన్ తదితరులు ఉన్నారు.

- కేపీహెచ్‌బీకాలనీ